**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

M.B.BHAVAN, 1-1-60/2,RTC X ROADS, HYDERABAD -20,
☎ 040-27665011, 27665012, Fax: 040- 27601001
E-mail: email@cpimap.org

**ప్రచురణార్థం:** **తేది:07.02.2012**

# పరిపాలనలో కీలక నిర్ణయాలు ఐఎఎస్‌లవే
# వారికి తెలీకుండా అవినీతి జరిగే అవకాశం లేదు
# అసోసియేషన్ మార్గదర్శకాలను రూపొందించాలి
# విలేకరులతో రాఘవులు

రాష్ట్రంలోగాని, కేంద్రంలో గానీ పరిపాలనలో ఐఎఎస్ అధికారులే కీలక నిర్ణయాలు తీసుకుంటారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బివి రాఘవులు అన్నారు. అలా కీలక నిర్ణయాలు తీసుకునే వారికి తెలియకుండా వివిధ వ్యవహారాల్లో అవినీతి జరిగే అవకాశమే ఉండబోదని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో తనను కలిసిన విలేకరులతో రాఘవులు మాట్లాడారు. ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిడికి తలొగ్గి కొన్ని నిర్ణయాలు తీసుకున్నామంటూ కొందరు ఐఎఎస్‌లు చెబుతున్నారని, అయితే వారు నిజంగా ఒత్తిడికి తలొగ్గితే అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఇదే సమయంలో రాజకీయ నాయకులతో కుమ్మక్కై నిర్ణయాలు తీసుకుని అవినీతికి ద్వారాలు తెరిస్తే మాత్రం ప్రజలు, సమాజం హర్షించబోవని విమర్శించారు. ప్రభుత్వంలోని పెద్దలు ఐఎఎస్‌లపై ఒత్తిడి తెచ్చినప్పుడు వారు తమ అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గామంటూ చెబుతున్న ఐఎఎస్‌లు ఈ విషయాన్ని గతంలోనే తమ అసోసియేషన్ దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. ప్రజలకు నమ్మకంగా, పారదర్శకంగా సేవలు అందించాల్సిన ఉన్నతస్థాయి అధికారులు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరముందని చెప్పారు. ఇందుకనుగుణంగా ఐఎఎస్‌ల అసోసియేషన్ కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించాలని రాఘవులు ఈ సందర్భంగా సూచించారు.

రాష్ట్రంలోని తక్షణ ప్రజా సమస్యలపై చర్చించేందుకు ఈనెల 15న వామపక్ష పార్టీలు సమావేశమవుతున్నాయని చెప్పారు. ఫిబ్రవరి 28న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఈనెల 16న హైదరాబాద్‌లో లెఫ్ట్ పార్టీల ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న తరుణంలో విద్యుత్ ఛార్జీలను పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందా? లేక ఉపసంహరించుకుంటుందా? అనే విషయాన్ని తేల్చుకోవాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే మున్సిపాల్టీ, ఇతర స్థానిక సంస్థల ఎన్నికలు, పొత్తుల గురించి విలేకరులు ప్రశ్నించగా...ఇవి రాష్ట్ర రాజకీయాలను నిర్ణయించేవి కావని సమాధానమిచ్చారు. అందువల్ల ఎన్నికల ప్రకటన వెలువడిన తర్వాత ఆయా జిల్లా కమిటీలతో చర్చించి స్థానిక పరిస్థితులనుబట్టి సర్దుబాట్లు చేసుకుంటామని వివరించారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఏయే సామాజికవర్గాలకు ప్రాధాన్యతనిచ్చారు? కేబినెట్‌లో ఆయా వర్గాల తూకం, కాంబినేషన్ ఎలా ఉంది? అనే విషయాలు తమకు అప్రధానమని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఏయే సామాజికవర్గాల నుండి ఎంతమంది మంత్రులుగా ఉన్నా ప్రజలకేం చేయకపోతే వారి వల్ల లాభమేంటని ప్రశ్నించారు.

**(జె జయరాం)**
ఆఫీసు కార్యదర్శి